ఎరువులేక.. ఎదగలేక..

- సకాలంలో అందని యూరియా
- నిస్తేజంగా వరి పొలాలు
- దసరాకి చిగురు తొడిగేనా అని సందేహం
- దిగుబడులపై రైతుల ఆందోళన



లక్ష్మీపురం వద్ద సకాలంలో యూరియా పడకపోవటంతో సక్రమంగా ఎదగని వరి పైరు

చల్లపల్లి: సకాలంలో యూరియా అందకపోవటంతో పచ్చగా కళకళాడుతూ ఉండాల్సిన వరి పొలాలు ఎదుగూ బొదుగూ లేక నిస్తేజంగా మారి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులకు కూడా ఒకటి, రెండు యూరియా బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకుంటుంది. అరకొర యూరియాతో పంటను ఏరకంగా కాపాడుకోవాలో అర్థంకాక రైతులు తల్లడిల్లుతున్నారు. చల్లపల్లి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 12,822 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. జూలై మొదటి వారంలో నాట్లు ప్రారంభించారు. ఎకరా పొలానికి నాట్లు వేసిన పది రోజులకు ఒకబస్తా, 40 రోజులకు మరొక బస్తా చొప్పున ఇప్పటి వరకూ రెండు బస్తాలు యూరియా చల్లాల్సి ఉంది. కేవలం కొందరికి అర బస్తా చొప్పున, మరికొందరికి బస్తా చొప్పున ఇచ్చారని మూడు నుంచి 20 ఎకరాల వరకూ సాగు చేస్తున్న రైతులకు ఇది ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. చేను అదును పోవడం వల్ల సమయం దాటిన తరువాత యూరియా చల్లినా ఉపయోగం ఉండదని అంటున్నారు. దీని ప్రభావం వల్ల దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి తాము నష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ బాగుంటే దసరా నాటికి వరి పైరు చిగురు తొడిగి పొట్ట వేయాల్సి ఉంది. అయితే యూరియా కొరత కారణంగా ఎదుగుదల లేక పొట్ట చిగురు వేసే పరిస్థితి ప్రస్తుతానికి ఎక్కడా కనిపించటంలేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యానికి తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

పెడన: పంటలకు అదును సమయంలో యూరియా జల్లేందుకు రైతన్నలు ఆపసోపాలు పడుతున్నారు. మరో పక్క యూరియా బ్లాక్‌లో కొనలేకపోతున్నామని, ఎరువుల దుకాణాల్లో విక్రయించే యూరియా కట్ట రూ.500 నుంచి రూ.600కు పైగా విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. బ్లాక్‌లో విక్రయించే వారిపై కఠిన చర్యలుంటాయని అధికారులు పేర్కొంటున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారానికి పొంతన ఉండటం లేదని చెబుతున్నారు. మండల వ్యాప్తంగా కమలాపురంలో 10 టన్నులు, ఉప్పలకలవగుంటలో 15 టన్నులు, శేరివత్తర్లపల్లిలో 10 టన్నులు, కూడూరులో 15 టన్నులు, పెడన సొసైటీలో పది టన్నులు యూరియాను రైతులకు అందజేశారు. ఐదెకరాలున్న రైతుకు కూడా కట్టే ఇవ్వడం ఏమిటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆకు ముదిరిన తరువాత యూరియా కొట్టినా ఫలితం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి అర కట్ట చొప్పున ఐదెకరాలున్న రైతుకు రెండున్నర కట్టలు ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



అడపావారిపాలెం సొసైటీ వద్ద రైతులు



కూడూరులో యూరియా కట్టలు కోసం...



ఘంటసాలలో ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు

అడపావారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి -2 అడపావారిపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణితో పాటు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన చెందారు.

20 ఎకరాలకు రెండు బస్తాలు ఇచ్చారు



సొంత పొలానికి తోడు మరికొంత కౌలుకు తీసుకుని మొత్తం ఈ ఏడు 20 ఎకరాలు సాగుచేస్తున్నా. ఇప్పటి వరకూ రెండు బస్తాలు యూరియా ఇచ్చారు. రెండు బస్తాలు 20 ఎకరాలకు ఎలా సరిపోతుంది. పైరు ఎదుగుదల లేదు.

–దొక్కు వేణు, రైతు, మంగళాపురం

జగన్ హయాంలో కొరతే లేదు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఒక్క రైతు కూడా యూరియా కోసం పడిగాపులు కాయలేదు. ముందు చూపు ఉన్న వ్యక్తి కాబట్టి అవసరం మేరకు యూరియా తెప్పించి రైతులకు పంపిణీ చేశారు. జగన్ రైతు పక్షపాతిగా నిలిచారు.

–పేరం నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్, మంగళాపురం

ఘంటసాల: ఘంటసాల, యండకుదురు రైతు సేవా కేంద్రాలకు, కొడాలి గ్రామంలోని పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందని రైతులకు తెలియడంతో సోమవారం ఉదయాన్నే ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. గ్రామ రైతులకు కాకుండా మల్లంపల్లి, బోళ్లపాడు, చిలకలపూడి, వి.రుద్రవరం గ్రామాలకు చెందిన రైతులకు మాత్రమే స్లిప్పులు పంపిణీ చేసి యూరియా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్తే అందరికీ ఇవ్వాలని, స్థానిక రైతులకు లేకుండా ఇతర గ్రామాల వాళ్లకు ఎలా ఇస్తారంటూ నిలదీశారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. చివరకు మల్లంపల్లి, బోళ్లపాడు, చిలకలపూడి, వి.రుద్రవరం గ్రామాలకు చెందిన రైతులకు, దేవరకోట రైతు సేవా కేంద్రం వద్ద కేంద్రం పరిధిలో కొంతమందికే యూరియా ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

యూరియా అందించటంలో విఫలం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బెనర్జీ



చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చల్లపల్లి: రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ డి.వనజాక్షికి అందజేశారు. ఈ సందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. ఎకరా వరి పంటకు ఒక బస్తా యూరియా అవసరం కాగా రాష్ట్రంలో ఎక్కడా కూడా ఎకరా రైతుకు ఒక బస్తా యూరియా ఇచ్చిన దాఖలాలు ఎక్కడా కనిపించ లేదని తెలిపారు. యూరియా కొరత లేదని అధికారులు, నాయకులు పైపైకి ప్రచారాలు, ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం రైతుకు సరిపడా యూరియా అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. అన్ని పీఏసీఎస్‌లలో యూరియా లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, రైతు నాయకులు మల్లుపెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, దాసరి గోపాలకృష్ణ, సిపిఐ నాయకులు నక్కా శ్రీనివాసరావు, కోడాలి నాగమల్లి, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు సత్కారం



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను సన్మానిస్తున్న ఎస్ఐ, ఎస్కేఆర్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు

కోడూరు: మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కోడూరు కోట రాఘవయ్య విద్యాసంస్థల (ఎస్కేఆర్) ఆధ్వర్యంలో సత్కరించారు. ఎస్కేఆర్ విద్యాసంస్థలో విద్యను అభ్యసించిన 28 మంది పూర్వ విద్యార్థులు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యారు. దీంతో విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం రాత్రి వీరందరికీ సన్మాన సభను నిర్వహించారు. మెగా డీఎస్సీ ద్వారా 21 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని, వీరిలో ఇద్దరు పీఈటీ పోస్టుకు, ఒకరు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు మరో 18మంది ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైనట్లు విద్యాసంస్థల గౌరవసలహాదారు కోట వెంకటసుబ్బారావు తెలిపారు. మరో ఆరుగురు విద్యార్థులు కానిస్టేబుల్‌కు ఎంపికైనట్లు చెప్పారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు ఉచిత న్యాయ సహాయం



మహిళా రక్షణ చట్టాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కె.వి.రామకృష్ణయ్య

గూడూరు: భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి మహిళకు ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. సంకల్ప -స్పెషల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా గూడూరు మండలం కప్పలదొడ్డిలోని దేవల మహర్షి చేనేత సహకార సంఘంలో మహిళలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, పోక్సో చట్టం, గృహ హింస, పనిచేయు ప్రదేశాల్లో జరిగే లైంగిక వేధింపులు, వరకట్నం, హిందూ వివాహ చట్టాలపై రామకృష్ణయ్య అవగాహన కల్పించారు. ఏదైనా ఇబ్బంది తలెత్తినప్పుడు ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ప్రతి మహిళకు ఉందని చెప్పారు. ఎలాంటి వివక్ష చూపించకుండా తగు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎల్.రాణి, మచిలీపట్న,మొవ్వ సీడీపీఓలు కె.గ్లోరి, ప్రసన్న, సూపర్‌వైజర్ ఉషశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

కృత్తివెన్ను: తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆక్వా రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం తరపున సోమవారం లక్ష్మీపురంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంఫెడా ద్వారా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. ఆక్వా రంగాన్ని వ్యవసాయ రంగం మాదిరి గుర్తించి బీమా సౌకర్యం ఇప్పించాలని, మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా నిర్ణయించిన ధరలు ఇవ్వాలని, నాణ్యమైన సీడు, ఫీడు ప్రభుత్వం ఇవ్వాలని, శీతల గిడ్డంగులు ప్రతి మండలంలో ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో జరిగే ఆక్వా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పులగం సుబ్రమణ్యం, రైతులు పి. నరసింహరావు, రామకోటి, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

హోంగార్డుకు కాంట్రిబ్యూషన్ చెక్కు అందజేత



హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: సుదీర్ఘకాలం పాటు హోంగార్డుగా తన సేవలను అందించిన జీవరత్నంకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సోమవారం కాంట్రిబ్యూషన్ చెక్కును అందజేశారు. జీవరత్నం 1984లో హోంగార్డుగా విధుల్లో చేరి ఇటీవల పదవీ విరమణ పొందాడు. దీంతో జిల్లాలోని హోంగార్డులంతా కలిసి సేకరించిన ఒకరోజే వేతనం రూ. 3,79,140 (కాంట్రిబ్యూషన్)లను ఎస్పీ చేతులమీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో హోంగార్డు విభాగం కీలకమైందేనన్నారు. పోలీసులతో పాటు హోంగార్డులు విధుల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజాసేవలో భాగస్వాములు అవుతున్నారన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. హోంగార్డులుగా పదవీ విరమణ పొందిన సిబ్బందికి పోలీసుశాఖ ఎల్లపుడు అండగా ఉంటుందన్నారు.

రైతులంటే భిక్షగాళ్లా..?



చల్లపల్లి మండలం పురిటిగడ్డ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

చల్లపల్లి: ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నలను బిక్షగాళ్లలాగా క్యూలో నిలబెట్టి పావు బస్తా ఇస్తాం.. అరబస్తా ఇస్తాం.. అంటూ అవమానిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్)కు సోమవారం 15 టన్నుల యూరియా లోడు వచ్చింది. నెల రోజుల తరువాత మరలా యూరియా రావటంతో ఒక్కసారిగా రైతులు పీఏసీఎస్‌కు చేరుకున్నారు. అయితే గతంలో యూరియా పొందని వారికి మొదట ఇచ్చి ఏమైనా మిగిలితే మిగిలిన వారికి ఇస్తామని అధికారులు చెప్పారు. ఓ సమయంలో రద్దీ పెరగటంతో కొందరు రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాను పీఏసీఎస్‌లకు తక్కువ మొత్తంలో పంపి ప్రైవేటు దుకాణాలకు ఎక్కువ మొత్తంలో పంపించడంపై మండిపడ్డారు. అధిక వర్షాల కారణంగా పంటలు మునిగిపోవటంతో యూరియా అవసరం పెరిగిందని రైతు అవసరాలకు అనుగుణంగా యూరియాను పంపిణీ చేయకపోవం బాధాకరమన్నారు. సొసైటీలకు ఎరువులు ప్రైవేటు షాపులకు వెళితే రూ.450 పెట్టి దుక్కు గులికలు గానీ, జింకు గానీ, ఇంకోటి గానీ కొంటే గానీ యూరియా ఇవ్వమంటున్నారని ఆరోపించారు. బస్తా, అరబస్తా ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే ఎలా అని ప్రశ్నించారు. ఐదు ఎకరాలు ఆపైన ఉన్న రైతులకు బస్తా యూరియా ఎలా సరిపోతుందని పూర్తి స్థాయిలో తమకు సరఫరా చేయాలన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని వినతి

బంటుమిల్లి: మండల పరిధిలోని ఉపాధి కూలీలకు పాత బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఎంపీడీఓ నీరజాక్షికి సోమవారం పలువురు కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. దాదాపు 8 వారాలుగా కూలీ డబ్బులు రావాల్సి ఉందని... రెక్కాడితేగానీ డొక్క నిండని స్థితిలో కూలీ డబ్బులు ఇన్ని రోజులు ఆగితే ఏం తినాలి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

గూడూరు: మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వైద్యాధికారి డాక్టర్ నిరీక్షణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించి పీహెచ్‌సీలో అన్ని విభాగాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారి రూపశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ హరగోపాల్, స్టాఫ్ నర్స్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న శివయ్యకు అభిషేకం

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని గంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని స్వామివారి శివలింగానికి 15వ తేదీన 216 కలువ పూలు, 150 కిలోల చక్కెరతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు క్షేత్రం కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్ (బుజ్జి), అర్చకులు అంబా సాయి కిరణ్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర విశిష్టత పురస్కరించుకుని ప్రాతఃకాల సమయంలో పంచామృతాభిషేకాలు, కలువ పూలతో విశేష అలంకరణ, సాయంత్రం ప్రదోషకాలంలో వేదపండితుల నేతృత్వంలో చక్కెరతో అభిషేకం చేస్తామని చెప్పారు. పంచదారతో భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని శివయ్య మహాభిషేకం ఆధ్యాత్మిక వేడుకను జయప్రదం చేయాలని కోరారు.

సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్న ఆలయాలు



కోడూరు: చంద్రగ్రహణం సందర్భంగా మూతబడిన ఆలయాలు సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్నాయి. గ్రహణం ఛాయలు వీడిన తరువాత అర్చకులు ఆలయాలను శుభ్రం చేసి సంప్రోక్షణ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంసలదీవి వేణుగోపాలస్వామి, ఉల్లిపాలెం శ్రీమన్నారాయణుడు, విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ, కల్యాణ వెంకటేశ్వరస్వామి, లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వామివారి ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు



మచిలీపట్నంటౌన్: కేంద్రీయ విద్యాలయ విద్యార్థిని కుంపటి అక్షయమౌళి నీట్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు పొందడం ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు అక్షయమౌళిని విద్యాలయంలో సోమవారం సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఎంతటి లక్ష్యమైనా చేరుకోవచ్చని చెప్పారు. సిద్ధార్థ వైద్య కళాశాలలో ఆమె సీటు సాధించడం అభినందనీయమన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన

బంటుమిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై సోమవారం ఒక రోజు శిక్షణలో భాగంగా ఒకేషనల్ తరగతి నిర్వహించినట్లు హెచ్ఎం జెవీ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా పెడన మండలం, నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ విభాగంలో పాఠశాల నుంచి 10, 9 తరగతులు చదువుతున్న 63 మంది విద్యార్థులకు ఐటీ రంగంలో ప్రధానమైన కంప్యూటర్ శిక్షణపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. రాబోవు కాలంలో కంప్యూటర్ ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కలిగించినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ పాఠశాల ఐటీ టీచర్ టి. రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరిగిందన్నారు.

నేడు అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ

మోపిదేవి: మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, గ్రామసర్పంచులు, అధికారులకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జె. స్వర్ణభారతి తెలిపారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్, జిల్లా ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశు సంవర్థకశాఖ, పౌరసరఫరాల శాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, విపత్తు నిర్వహణాశాఖ, ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ, గృహనిర్మాణశాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి జిల్లా కేంద్ర గ్రంథాలయ డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ పూలమాలవేసి సిబ్బంది, పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1967లో యునెస్కో ఈ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంను ప్రారంభించిందన్నారు. రాయడం, చదవడం అందరి ప్రాథమిక హక్కు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలని ఆయన సూచించారు.

సంక్షిప్త వార్తలు

ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, సభ్యులు రైతులు, ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందించే విధంగా పాలన చేయాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. కేడీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోని సమావేశపు హాలులో పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం బ్రాంచ్‌లకు సంబంధించిన సహకార సంఘాల అధ్యక్షులకు ఒక రోజు శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సహకార సంఘాలపై నమ్మకంతో పెట్టుబడులు పెడుతున్నారని ప్రతి రూపాయికి సంపూర్ణ భద్రత కల్పించి ఖాతాదారుల్లో భరోసా నింపాలన్నారు. సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జీఎం బీఎల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు నివాళి

చల్లపల్లి: వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఉప్పాల మురళీమోహన్ (70) ఎలియాస్ మోహన్ సోమవారం ఉదయం గుండెపోటు కారణంగా హఠాన్మరణం పొందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మోహన్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మత్తి రాంబాబు, అబ్దుల్ అర్షద్, యడ్లపల్లి జగదీష్, బాలు, గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కార్నియాలు సేకరణ

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మృతిచెందిన ఇద్దరి నుంచి నాలుగు కార్నియాలను సేకరించారు. చల్లపల్లికి చెందిన గణేష్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణ, అలాగే ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఉప్పల మురళీమోహన్ హఠాన్మరణం పొందారు. వాసవీ క్లబ్ సభ్యులు మృతుల కుటుంబాలను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారి వారి కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి ఇద్దరి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. జెడ్పీటీసీ సభ్యులు రాజులపాటి కళ్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ ప్రెసిడెంట్ రాజులపాటి శివ, వాసవీ క్లబ్ సభ్యులు అన్నవరపు లక్ష్మీ, గోళ్ళ ద్రోణ, తమ్మన సతీష్, పాండురంగారావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెడన: పట్టణంలోని బ్రహ్మపురానికి చెందిన తాడిశెట్టి సత్యనారాయణ అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయాడు. దీంతో మచిలీపట్నం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు. లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ కన్వీనర్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యవసర వస్తువులు, బియ్యం, బట్టలు, రూ.3వేలు నగదును అందజేశారు. మాదిరెడ్డి అంజిబాబు, మల్లంపల్లి వీర వెంకట రామాంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జిగా రంగారావు

నాగాయలంక: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావును పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన నాగాయలంకలో విలేకర్లకు తెలిపారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జి బాధ్యతలను తనకు అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అవనిగడ్డ మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాజగొల్ల రమేష్ యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆ జిల్లాలో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

పెడన: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో జ్వర పీడితులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. పెడన పీహెచ్‌సీలో సోమవారం ఓపీ వందకు పైగా ఉండగా వీటిల్లో పెద్ద సంఖ్యలో జ్వరపీడితులున్నారు. కొందరు నీరసంగా ఉండటంతో వారికి సెలైన్ బాటిల్స్ పెట్టారు. కోర్సు కింద ఐదు రోజులు బాటిల్స్ పెట్టించుకోవాలని సూచిస్తూ రోగులను పంపించి మరుసటి రోజు రావాల్సిందిగా సూచిస్తున్నారు. వైద్యాధికారి పర్వేజ్‌హైదర్ మాట్లాడుతూ వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని, వాటిని నియంత్రించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆకు కూరలతో అమితమైన ఆరోగ్యం

కృత్తివెన్ను: గర్భిణులు, బాలింతలు రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఆకుకూరలను తీసుకోవడం వల్ల అమితమైన ఆరోగ్యాన్ని పొందగలరని ఐసీడీఎస్, వైద్యాధికారులు సూచించారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని పెదపల్లెపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో నాణ్యమైన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. మనకు అందుబాటులో దొరికే ఆకుకూరలు, మునగాకు, కరివేపాకు తప్పనిసరిగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రభావతి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.